మాఫీ మంటలు

- పంట రుణమాఫీపై సర్కారు మోసం చేసిందంటూ ఆందోళనలు
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు
- తరలివచ్చిన రైతులు

కొర్రీలు పెట్టి, కోతలు విధించి పంట రుణమాఫీపై సర్కారు మోసం చేసిందంటూ జిల్లాలో రైతులు ఆందోళనకు దిగారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు, నాయకులు శుక్రవారం ధర్నాలు చేశారు. ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీని సంపూర్ణంగా చేయాలని నినాదాలు చేశారు. ఎన్నికల సమయంలో రైతులందరికీ రుణమాఫీ చేస్తానని దేవుళ్లపై ఒట్టేసిన సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ కోసం ఎంతో ఆశతో ఎదురు చూసి, మోసపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సర్కారు మాఫీ డ్రామాపై నిప్పులుకక్కారు. కాంగ్రెస్ అంటేనే మోసానికి మారుపేరుగా నిలిచిందని దుయ్యబట్టారు.

- న్యూస్ నెట్‌వర్క్, సిద్దిపేట జిల్లా, ఆగస్టు 22

దుబ్బాక : బస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట : ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఫరుఖ్ హుస్సేన్

కోహెడ : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గజ్వేల్ : ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి

నంగునూరు : తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొమురవెల్లి : చేర్యాలలో జరిగే ధర్నాకు వెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

చిన్నకోడూరు: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న నాయకులు

హుస్నాబాద్ : ప్లకార్డు ధరించి రైతులతో కలిసి ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్; బీఆర్ఎస్ నాయకులు

కోహెడ : అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నారాయణరావుపేట : ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అక్కన్నపేట: మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న నాయకులు, రైతులు

గజ్వేల్ : ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మద్దూరు: బీఆర్ఎస్ ధర్నాకు తరలివెళ్లిన ధర్మారం రైతులు

జర్నలిస్టు అరెస్టుకు యత్నించడం దుర్మార్గం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, ఆగస్టు 22 : సిద్దిపేటలో అర్ధరాత్రి జర్నలిస్టు ఆకుల శ్రీనివాస్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసేందుకు పోలీసులు యత్నించడాన్ని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అర్ధరాత్రి కాంగ్రెస్ గూండాలతో కలిసి ఇంట్లోకి చొరబడేందుకు ప్రయత్నించి, వృద్ధురాలైన తల్లి, ఆయన కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం అత్యంత దుర్మార్గమన్నారు. సిద్దిపేటలో రౌడీయిజానికి, గుండాయిజానికి చోటు లేదని, కాంగ్రెస్ నాయకులు, పోలీసులు ఈ కొత్త సంస్కృతిని ప్రోత్సహించడం అత్యంత బాధాకరమన్నారు. సిద్దిపేట అంటేనే శాంతికి, ప్రేమకు చిహ్నమని అన్నారు. శ్రీనివాస్ రెడ్డికి, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు. వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. ఇలాంటి అక్రమ చర్యలకు మరోసారి పాల్పడితే, ప్రభుత్వం, పోలీసులు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎమ్మెల్యే హరీశ్‌రావు హెచ్చరించారు.

రేవంత్‌రెడ్డి.. నాకు రుణమాఫీ ఎందుకు కాలేదో చెప్పు

హుస్నాబాద్ ధర్నాలో మాట్లాడుతున్న మహిళా రైతు మేడిపెల్లి వజ్రవ్వ

హుస్నాబాద్, ఆగస్టు 22 : సీఎం రేవంత్ రెడ్డి... నేను నిరుపేద రైతును... ఎలాంటి దిక్కులేని నాకు ఎకరా పొలమే దిక్కుగా బతుకున్న...నేను తీసుకున్న రూ.48వేల పంట రుణమాఫీ ఎందుకు కాలేదో చెప్పు అని మహిళా రైతు మేడిపల్లి వజ్రవ్వ తెలిపారు. దేవుళ్ల మీద ఒట్టేస్తివి, సీఎం కాగానే మొత్తం మాఫీ చేస్తానంటివి... మరి నాకెందుకు రుణ మాఫీ కాలేదో చెబుతావా...? అని ప్రశ్నించారు. మాలాంటోళ్ల గోస నీకు తగలదా.? అంటూ గురువారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన ధర్నాకు వచ్చిన అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామానికి చెందిన మేడిపెల్లి వజ్రవ్వ అనే మహిళా రైతు తన ఆవేదన వెల్లగక్కింది. ఈమెకు రేషన్‌కార్డు ఉంది, ప్రభుత్వ ఉద్యోగం లేదు. ఖాతా రెగ్యులర్‌గా ఉంది, ప్రతిసారీ సమయానికి రెన్యువల్ చేస్తుంది. ఈమెకు రుణమాఫీ కాలేదు. ఇదేంటని బ్యాంకు, వ్యవసాయ అధికారులను అడిగితే ఇలా జరగొద్దు కదా...అలా ఎలా జరిగింది అంటూ వాళ్లు కూడా ఆశ్చర్యపోవడం తప్ప మేరే ఇతర సమాధానం చెప్పడం లేదంటూ గొల్లుమంది. రెండు లక్షల వరకు మాఫీ అన్నారు. నాకు రూ.48వేల రుణమాఫీ ఎందుకు కాదని ప్రశ్నిస్తున్నది. ఇప్పటికైనా వెంటనే రుణమాఫీ అయ్యేలా చూడాలని ఆమె వేడుకుంటున్నది.

కాంగ్రెస్ విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటు

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

చేర్యాల, ఆగస్టు 22 : అరవై శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాకుండానే మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం సిగ్గుచేటని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి విమర్శించారు. గురువారం చేర్యాల పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్ అధ్యక్షతన నాలుగు మండలాల సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి షరుతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం చేర్యాల, మద్దూరు మండల కార్యదర్శులు కొంగరి వెంకటమావో, ఆలేటి యాదగిరి, జిల్లా కమిటీ సభ్యుడు బద్దిపడగ కృష్ణారెడ్డి, తాడూరి రవీందర్, పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు, జిల్లా కమిటి సభ్యులు బండకింది అరుణ్‌కుమార్, దాసరి ప్రశాంత్, నాయకులు బండకింది బాలనారాయణ, బోయిని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

మాట్లాడుతున్న టీఆర్‌పీఎస్‌వీ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ప్రభు

మిరుదొడ్డి, ఆగస్టు 22 : ప్రజల ఓట్లతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రైతులకు రుణ మాఫీ చేయకుండా మోసం చేసిందని తెలంగాణ రాష్ట్ర ప్రజా సంకల్ప ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి (టీఆర్‌పీఎస్‌వీ) శ్రీరాం రామకృష్ణ ప్రభు అన్నారు. గురువారం మిరుదొడ్డిలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎవరినీ మోసం చేయకుండా తాను నమ్ముకున్న భూతల్లి పై ఆధార పడి జీవిస్తున్న రైతులను సీఎం రేవంత్ రెడ్డి నట్టేట ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు కిషన్, భిక్షపతి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠధామం అభివృద్ధికి రూ.15లక్షలు

సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న

హుస్నాబాద్‌టౌన్, ఆగస్టు 22 : పట్టణంలోని కోర్టువెనుక విభాగంలో వైకుంఠధామాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.15లక్షలు కేటాయించాలని మున్సిపల్ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. మున్సిపల్ పాలకవర్గ సాధారణ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా పలు అభివృద్ధికి పనులకు నిధులు కేటాయిస్తూ తీర్మానించినట్లు చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న విలేకరులకు తెలిపారు. పట్టణంలోని పలు వీధుల్లో విద్యుత్ దీపాలు, స్తంబాల ఏర్పాటుకు రూ.15లక్షలు కేటాయించినట్లు వివరించారు. మున్సిపల్ వాహనాల మరమ్మతులకు రూ.2లక్షలు, వాహనాల బీమాకోసం రూ.1.50లక్షలు, జీపీఆర్ సిస్టం కోసం రూ.90వేలు, 2024-25 సంవత్సరానికి పారిశుధ్య కార్మికులకు దుస్తులు తదితర వాటికి రూ.4లక్షలు కేటాయించినట్లు తెలిపారు. పలు సమస్యలను పరిష్కరించాలని ఆయా వార్డుల కౌన్సిలర్లు కోరారు. సమావేశంలో కమిషనర్ టి. మల్లికార్జున్ గౌడ్, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు నళినిదేవి, రమాదేవి, భాగ్యారెడ్డి, కల్పన, సుప్రజ, రవీందర్, హరీశ్, రాజు, సరోజన, పద్మ, స్వర్ణలత, కోఆప్షన్‌సభ్యులు అయూబ్, శంకర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఏఈ పృధ్వీరాజ్, ఆర్ఐ సాంబరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, టీపీఎస్ హబీబున్నిసా, మెప్మా కోఆర్డినేటర్ ముత్యాల రాజు, హరితహారం సూపర్‌వైజర్ జాలిగాం శంకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రవి, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే హరీశ్‌రావుకు రాజీనామాలు కొత్త కాదు

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, ఆగస్టు 22 : పచ్చటి సిద్దిపేటలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు గూండాలతో వచ్చి హల్ చల్ చేసి రాజకీయ పబ్బం గడుపుకోవాడనికి చూస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మీడియా సమావేశంలో తోట కమలాకర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ కోసం ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎన్నో మార్లు తన మంత్రి, ఎమ్మెల్యే పదవులకు తృణప్రాయంగా వదిలి పెట్టిన నాయకుడని గుర్తు చేశారు. రైతులకు రుణమాఫీ, ఆరు గ్యారెంటీలు అమలు చేయని సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామ చేయాలని డిమాండ్ చేశారు.

చేనేత కార్మికుడికి బాపూజీ అవార్డు

నేత కార్మికుడికి కొండ లక్ష్మణ్ బాపూజీ అవార్డును అందిస్తున్న అధికారి బాలాజీ

సిద్దిపేట టౌన్, ఆగస్టు 22 : సిద్దిపేట చెందిన చేనేత కార్మికుడు కొంక సాయిలుకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మక కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు వరించింది. ఈ సందర్భంగా హైదరాబాద్ వీవర్స్ సర్వీస్ సెంటర్ అధికారి బాలాజీ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేనేత రంగంలో ప్రతిభ కనబరిచిన 60 ఏండ్లు పై బడిన వారికి లక్ష్మణ్ బాపూజీ అవార్డును అందిస్తుందన్నారు. అవార్డుతో పాటు ప్రతి నెలా రూ.8 వేలు సంవత్సరం పాటు ఇస్తుందన్నారు. ఈ మేరకు నేత కార్మికునికి 96 వేల రూపాయలను బ్యాంక్ అకౌంట్‌లో జమ చేశారు. కార్యక్రమంలో గుండ్ల హనుమంత్.కామిని నగేశ్ ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సిద్దిపేట కమాన్, ఆగస్టు 22 : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్ కుమార్, పట్టణ కార్యదర్శి బత్తుల అభిషేక్, భాను, పట్టణ నాయకులు షారూక్, నవదీప్, సాయి తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కుల బహిష్కరణ చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ నాయకులు

సిద్దిపేట కమాన్, ఆగస్టు 22 : అక్బర్ పేట మండలం బొప్పాపూర్‌లో దళిత సామాజిక వర్గానికి చెందిన బండమీది సాయిలు కుటుంబాన్ని కుల బహిష్కరణ చేయడం హేయమైన చర్య అని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బక్కెల్లి బాలకిషన్ అన్నారు. సిద్దిపేటలోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగత కారణాలతో అదే సామాజిక వర్గానికి చెందిన కొంతమంది కక్ష సాధింపుగా ఆయన మృతదేహాన్ని మోసుకెళ్లే సమయంలో కనీసం డప్పు కూడా కొట్టనివ్వకుండా, అంత్యక్రియలకు ఎవరూ సహకరించరాదని హుకుం జారీ చేయడం దుర్మార్గమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా స్థానిక ఎస్సై, ప్రభుత్వ అధికారులు నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనం రమేశ్, ఎల్లయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఒకే కుటుంబంలో నలుగురికి విద్యుత్ షాక్

ఒకరి మృతి

చేర్యాల, ఆగస్టు 22: మండల పరిధిలోని ముస్త్యాల గ్రామంలో గురువారం ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి విద్యుత్ షాక్ తగలింది. ఈ ఘటనలో బైర ఐలవ్వ (60) అక్కడికక్కడే మృతి చెందింది. గమనించిన బైర ఐలయ్య చాకచక్యంగా వ్యవహరించి ముగ్గురిని ప్రాణాలతో కాపాడారు. వివరాలు.. ముస్త్యాల గ్రామానికి చెందిన బైర అంజయ్య భార్య ఐలవ్వ, కొడుకు అనిల్, కోడలు రమ్య, కూతురు శ్యామల గురువారం సాయంత్రం ఇంటి ఆవరణలో ఇనుప దండెంపై ఆరేసిన బట్టలు తీసే క్రమంలో మొదట ఐలవ్వకు విద్యుత్ షాక్‌కు గురైంది. ఆమెను రక్షించే క్రమంలో మిగతా ముగ్గురు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. విషయాన్ని గమనించిన పొరుగింటి బైర ఐలయ్య చాకచాక్యంగా వ్యవహరించి కర్ర సహాయంతో విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. బాధితులను చికిత్స నిమిత్తం చేర్యాల సర్కారు దవాఖానకు తరలించారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం

వర్గల్, ఆగస్టు 22 : బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, సర్పంచుల ఫోరం మండల మాజీ ప్రధాన కార్యదర్శి కటికె సంధ్యాజానీ దంపతులు మండల పరిధిలోని తున్కిఖల్సాలో నిర్మించనున్న మహంకాళమ్మ ఆలయానికి గురువారం రూ.50,016 ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కొన్నేండ్ల నుంచి గ్రామంలో పేదింటి ఆడబిడ్డల కల్యాణం కోసం పుస్తె మెట్టెలు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తుంది.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

గజ్వేల్, ఆగస్టు 22 : కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మున్సిపాలిటీ పరిధిలోని రాజిరెడ్డిపల్లి సమీపంలోని పార్శికుంట వద్ద గురువారం జరిగింది. సీఐ సైదా తెలిపిన వివరాలు.. గజ్వేల్ పట్టణంలో నివాసం ఉంటున్న బుడగ జంగాల పనేటి చంద్రం (30) భార్య కాపురానికి రావడంతో లేదని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య అనిత, కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చెరువులో పడి..

మిరుదొడ్డి, ఆగస్టు 22 : ప్రమాద వశాత్తు చెరువులో పడి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని మల్లుపల్లిలో గురువారం సాయంత్రం జరిగింది. ఎస్సై పరశురాములు తెలిపిన వివరాలు.. గ్రామానికి బంజర్ల నవీన్ (27) తనకున్న 2 ఎకరాల వ్యవసాయ భూమిలో వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఇదే క్రమంలో గురువారం సాయంత్రం నవీన్ గ్రామ శివారులోని చౌదరి చెరువు కట్టపై మద్యం సేవించి మూత్ర విసర్జన చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మృతి చెందాడు. మృతుడికి భార్య నవనీత, ఇద్దరు పిల్లలు రుత్విక్, సహస్ర ఉన్నారు. భార్య నవనీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారును ఢీ కొట్టిన లారీ

ప్రాణాలతో బయటపడిన గర్భిణి

కొండపాక (కుకునూరుపల్లి), ఆగస్టు 22 : కారును లారీ ఢీ కొట్టడంతో ఒకరికి తీవ్రగాయాలు కాగా మరొకరు స్వల్పగాయాలైన ఘటన మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన శ్రీధర్, నవీన భార్యాభర్తలు. గురువారం చొప్పదండి నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తున్న క్రమంలో తిమ్మారెడ్డిపల్లి హోటళ్ల వద్ద హైదరాబాద్ నుంచి సిద్దిపేట వైపునకు వస్తున్న లారీ వీరి కారును బలంగా ఢీ కొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న శ్రీధర్‌కు స్వల్ప గాయాలు కాగా రెండు నెలల గర్భిణి నవీనాకు ఎడమ చేయి విరగడంతో పాటు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది మెడికల్ టెక్నీషియన్ మహేందర్, పైలట్ శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకొని వారికి ప్రథమ చికిత్స అందించడంతో పాటు అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

అర్హులందరికీ రుణమాఫీ

రాయపోల్, ఆగస్టు 22 : అర్హులందరికీ రుణమాఫీ వస్తుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గజ్వేల్ డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ బాబూనాయక్ అన్నారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లోని రైతు వేదికలను తనిఖీ చేశారు. రుణమాఫీపై రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏఈవోలు అప్రమత్తంగా ఉండి రైతులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. రుణమాఫీ కాని రైతులు ప్రత్యేక కౌంటర్లలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయధికారి నరేశ్, పెద్దాఆరెపల్లి ఏఈవో ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజేషన్ చేసుకోవాలి

దుబ్బాక, ఆగస్టు 22 : మున్సిపల్ పరిధిలో ఎల్ఆర్ఎస్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు రెగ్యులరైజేషన్ చేసుకోవాలని కమిషనర్ రమేశ్‌కుమార్ తెలిపారు. అనధికార లేఅవుట్లలో ప్లాట్ కొనుగోలు చేసి, ఎల్ఆర్ఎస్ కోసం చేసుకున్న దరఖాస్తులను మున్సిపల్ కార్యాలయంలో అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాట్ డాక్యుమెంట్స్‌ను తీసుకుని, రెగ్యులరైజేషన్ చేసుకోవాలని సూచించారు.

హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలి

హుస్నాబాద్‌టౌన్, ఆగస్టు 22 : 2020 సంవత్సరంలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు మున్సిపల్ కార్యాలయంలోని హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణానికి చెందిన దరఖాస్తుదారులు ఎల్ఆర్ఎస్‌కు చెల్లించిన రసీదు, ఈసీ, భూమి పత్రాలు, వెంచర్‌కు సంబంధించిన మ్యాప్‌తో సంప్రదించాలని కోరారు.

డీఎంహెచ్‌వో సందర్శన

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 22 : మండలంలోని మహ్మదాపూర్ హెల్త్ సబ్ సెంటర్‌ను గురువారం డీఎంహెచ్‌వో డాక్టర్ ఆనంద్ సందర్శించారు. ఈ సందర్భంగా దవాఖానలో రికార్డులను పరిశీలించారు. గ్రామంలో ప్రతి రోజూ హెల్త్ సిబ్బంది ఇంటింటా ఫీవర్ సర్వేను నిర్వహించాలని సూచించారు.

ఎర్రోళ్ల శ్రీనివాస్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నాయకులు

సిద్దిపేట, ఆగస్టు 22 : ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను విమర్శించే స్థాయి సిద్దిపేట కాంగ్రెస్ నాయకులకు లేదని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నాయకులు రాములు, సారయ్య, కనకయ్య అన్నారు. గురువారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ పోరాటం చేస్తుంటే ప్రజల దృష్టి మళ్లించేందుకు హనుమంతరావును అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ దొంగ నాటకాలు ఆడుతున్నదన్నారు. ఎర్రోళ్ల శ్రీనివాస్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకుడు దేవులపల్లి యాదగిరి వెంటనే ఆయనకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు యాదయ్య, రమేశ్, కనకయ్య, యాదగిరి పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి


భూంపల్లి పీఎస్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), ఆగస్టు 22 : విద్యార్థులు పట్టుదలతో చదవాలని డీఈవో శ్రీనివాస్ రెడ్డి సూచించారు. గురువారం అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని కూడవెల్లి, అక్బర్‌పేట, బేగంపేట, రుద్రారం, ఖాజీపూర్, జంగపల్లి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులకు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. ఈ సందర్భంగా డీఈవో శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించి విద్యార్థులు విద్యా బోధన చేయాలని పేర్కొన్నారు. డీఈవో వెంట ఎంఈవో జోగు ప్రభుదాస్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాగులు అందజేత

మిరుదొడ్డి : జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న కమలాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, ఆగస్టు 22 : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నైపుణ్య ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సురేందర్ రెడ్డి జ్ఞాపకార్థం డైరెక్టర్ తోట కమలాకర్ విద్యార్థులకు బ్యాగులను అందజేశారు. కార్యక్రమంలో అర్చన, ఆర్తి, ప్రశాంత్, నైపుణ్య ఆర్గనైజేషన్ సభ్యులు మొగుల్ల చైర్మన్ మొగుళ్ల ఐలయ్య, సభ్యులు రమేశ్, దార మల్లయ్య, కాస కిష్టయ్య, సాయి కుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

కొండపాక (కుకునూరుపల్లి): నోట్ బుక్‌లు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

కొండపాక (కుకునూరుపల్లి), ఆగస్టు 22 : కుకునూరుపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం ఉమ్మడి కొండపాక మండలం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు జోనల్ చైర్మన్ చింతా ప్రసాద్, గంప కృష్ణమూర్తి నోట్ బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రతినిధులు ఉప్పల రాజు, వేముల శివప్రసాద్, కాపర్తి రాజ్‌కుమార్, గంగిశెట్టి పవన్, కొమురవెల్లి సంతోశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయపోల్ ఏవోగా నరేశ్

రాయపోల్, ఆగస్టు 22 : రాయపోల్ మండల వ్యవసాయ అధికారిగా నరేశ్ గురువారం రైతు వేదిక కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గతేడాది రెగ్యులర్ ఏవో లేక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు నమస్తే తెలంగాణలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలో వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహించిన నరేశ్ బదిలీపై రెగ్యులర్ ఏవోగా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా గజ్వేల్ ఏడీఏ బాబునాయక్, ఏఈవో ప్రవీణ్, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా

సిద్దిపేట టౌన్, ఆగస్టు 22 : మద్యంతాగి వాహనాలు నడుపుతున్న వాహనదారులకు సిద్దిపేట న్యాయస్థానం రూ.10,500 జరిమానా విధిస్తూ గురువారం తీర్పు ఇచ్చింది. వన్‌టౌన్ సీఐ లక్ష్మీబాబు తెలిపిన వివరాలు.. పట్టణంలోని ముస్తాబాద్, ఎన్సాన్‌పల్లి చౌరస్తాలలో పోలీసు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలను నిర్వహించామన్నారు. ఈ మేరకు మద్యం తాగి వాహనాలను నడుపుతున్న 8 మందిని పట్టుకుని జడ్జి కాంతారావు ముందు హాజరు పరచగా జరిమానా విధించారని చెప్పారు. మద్యం తాగి వాహనాలను నడిపిన ఐదు గురికి న్యాయస్థానం 8,500 జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ..సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్, ఎంపీడీవో చౌరస్తాలతో పాటుగా రా జీవ్ రహదారిపై సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశామన్నారు. మద్యం తాగి వాహనదారులను పట్టుకొని జడ్జి కాంతరావు ముందు హాజరు పరచాగా జరిమానా విధించారని వివరించారు.

రేబర్తిలో వనమహోత్సవం

మద్దూరు(ధూళిమిట్ట), ఆగస్టు 22 : మండల పరిధిలోని రేబర్తిలో వనమహోత్సవంలో భాగంగా గురువారం గ్రామస్తులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మాధవ్‌జాదవ్, ఫీల్డ్ అసిస్టెంట్ ఐలయ్య, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, నిర్మల, అనురాధ, ఏఎన్ఎం మల్లీశ్వరి, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.